# కృష్ణ సుందరి

కె.వి.ఎస్. అచ్యుతవల్లి

*పరిస్థితులకు తలవంచేవారు రెండు రకాలు. సమాధానపడి జీవితం కొనసాగించగలవారు ఉన్నంతలో ఉత్తములు. రెండవ రకానికి చెందినవారు అహం చంపుకోలేరు.*

---

"నీకు ఈపేరెవరు పెట్టారు?"

సుదర్శనం తొలి రాత్రి గుమ్మందగ్గరగా నిలబడ్డ భార్య సుందరిని మొదటిసారిగా ఈ ప్రశ్నతో పలకరించాడు. ఆమెకు ఏం మాట్లాడాలో తెలియలేదు. అతను దగ్గరకు తీసుకుంటాడనీ, ఏదో ప్రేమగా పలకరిస్తాడనీ ఎన్నెన్నో ఆశల వలలో తన హృదయాన్ని చిక్కించుకున్న సుందరి, అతని పలకరింపులోని అవమానపూరిత ధోరణి పసిగట్టి చిన్నబోయింది. మూడు వేల సన్నజాజి పూలతో కుట్టిన పొడుగాటి జడను భుజంమీంచి ముందుకు వేసుకుని జడకేసి చూసుకుంటూ, స్థాణువల్లే నిలబడింది.

"నీ అందానికి ఆ పూలజడకూడా ఎందుకు? నీ జడలో పెట్టటంకన్నా ఆ పెంటకుప్పమీద పోస్తే నయం! దారే పోయేవాళ్ళకన్నా వాసన కలుగజేస్తాయ్!"


సుదర్శనం తన ఉనికిని సహించలేకపోతున్నాడని తెలుసుకుంది. వెనుదిరిగి తలుపు తీయబోయింది. బయట గొళ్ళెం! సుదర్శనం పకపక నవ్వాడు. ఎంతో హృదయవిదారకంగా ధ్వనించింది ఆ నవ్వు! సుందరి విస్మిత దృష్టితో భర్త వైపు చూసింది.

"మనిద్దరికీ ఈ చెర తప్పదు! గోడవార తుంగచాప ఉంది, చూడు! అది పరుచుకుని పడుకో!" టేబుల్ దగ్గరకు వెళ్ళి, గాజు కూజాలోని నీళ్ళు గ్లాసులోనికి వంపుకుని, గడగడా త్రాగి మళ్ళీ మంచందగ్గరకువచ్చి కూర్చున్నాడు. సుందరి చాప పరుచుకుని జడ మడుచుకుని దానిమీద తల పెట్టుకుని వంపుగా పడుకొంది. సుదర్శనానికి గుండెల్లో ఏమిటోగా మంట ప్రారంభమయింది. తనను ఎవ్వరో బలవంతంగా వంచించినట్లు బాధ పట్టుకుంది. చేతిలో కత్తి పుచ్చుకుని తనకు ఈ పెళ్ళి జరిపించిన వాళ్ళనందరినీ వరసనే నరుక్కుపోవాలన్నంత కసీ, క్రోధోద్వేగమూ కలిగాయి. సిగరెట్టుకోసం లాల్చీ జేబు తడిమాడు. ఎర్రని ఉలిపిరి కాగితంలో చుట్టబడిన కాసు సొట్టాం చేతికి తగిలింది. తీసి విప్పాడు. నవ్వుగా తళతళా మెరుస్తున్నది బంగారు నవరసు. ఆ మెరుస్తున్న కాసును ఆ పల్చని తెల్లని జరీచీర చెంగుకు ముడెయ్యాలని పెద్దల సూచన! సుదర్శనం పళ్ళు కొరుక్కున్నాడు. అప్రయత్నంగా సుందరి వైపు చూశాడు. రెపరెప లాడుతున్న పమిటచెంగులోంచి కొరకంచు రంగులోఉన్న ఆమె చెయ్యి నడుంమీదుగా చాపమీదకు వ్రాలి ఉంది. అబ్బ! ఎంత నలుపు! కాకినలుపు! మసి నలుపు! కుండ నలుపు! తాటాకుతో ఆమె చేతిమీద గీస్తే క్రిందకు మసిలా రాల్తుందా అన్నంత నల్లగా ఉన్నది. ఛీ! ఛీ! ఎల్లా? ఎల్లాగ ఆమెను స్పృశించేది? చూస్తోంటే శరీరం జలదరిస్తున్నది. అరచేయి కూడా నల్లగానే ఉంది, కనీసం లేత రంగులోనన్నా లేకుండా. అబ్బ! ఎల్లా పుట్టించాడు భగవంతుడు? సుందరిట! సుందరి! పేరులోనన్నా సుందరత్వం స్ఫురించాలన్న ఆవేదనతో ఆమెకీ పేరు పెట్టి ఉంటారు, ఆ నిర్భాగ్యపు తల్లితండ్రులు.

"ఇటు చూడు! ఏయ్ నిన్నే!" అన్నాడు.

గుమ్మన లేచి కూర్చుంది, సుందరి.

"లేవక్కర్లా!" వ్యంగ్యంగా అన్నాడు. కుంచించుకుపోయింది సుందరి. అతనిలో ఏదో అరని జ్వాల రగుల్కొంది. అది మాటలనే మంటలుగా మారి సుందరి మనస్సును, శరీరాన్ని కూడా



నిలువునా దహించాలని ప్రయత్నిస్తున్నది!

"ఈ కాసు నీ కిచ్చావిట! తీసుకో!" మంచం మీద కూర్చునే చాపమీదికి విసిరాడు. మౌనంగా ఆమె కాసు తీసుకుని చెంగుకు ముడేసుకోబోయింది. సుదర్శనం శరీరం కంపరమెత్తింది. మెదడులో నేయి సుత్తులతో మోదుతున్నట్లు బాధ కలిగింది!

"చెంగుకు నేను ముడేశాననుకుంటేకాని తృప్తి లేదా ఏమిటి? పెట్టెలో పడేయి!" చీదరింపుగా అన్నాడు. ఆడపిల్లలు నోణీలు వేసుకోవటం మొదలుపెట్టిన దగ్గరినుంచీ అత్యావసర వస్తువులు ఏమైనా కనబడితే, వెంటనే చెంగుకు కట్టుకుంటారన్న సంగతి సుదర్శనానికి తెలీదు. సుందరి లేచి పెట్టెలో కాసు పడేసి వచ్చి కూర్చుంది. ఆమె తలలో సన్నజాజులు నున్నితంగా నవ్వుతున్నాయి. నల్లని చెంపలపై ఆమె చెవుల తెల్లనిరాళ్ల దుద్దుల తళుకు ప్రతిఫలిస్తున్నది. నుదుట నయాపైసంత ఎర్రని కుంకుమ కళవళ పడుతున్నది. కిటికీలోంచి నీలాకాశంమీద శుద్ధ సప్తమి చంద్రుడు ఆమె స్త్రీత్వాన్ని చూసి తెల్లబోతున్నాడు.

"నిద్ర రావటంలేదు కామోల్ను! పాపం! కూర్చునే ఉన్నావ్!" ఏదో మాట్లాడాలి. ఆమె మనస్సును తనకువీలయినంతమట్టుకు ముక్కలు ముక్కలుగా కోయాలి అన్నంత కసి అతనిలో గూడు కట్టుకుంటున్నది. సుందరి మాట్లాడాలి. కాని, ఏమని మాట్లాడుతుంది? స్తబ్దుగా కూర్చుంది.

"నీకు ఆ నున్నితమైన పూలు ముడుచుకుందుకు మన సెట్లా ఒప్పింది? ఆ పల్చని జరీచీర కట్టుకుంటుంటే నీ శరీరం బాధతో ముడుచుకుపోలేదా? నిన్ను అందరూ 'సుందరీ! సుందరీ!' అని పిలుస్తుంటే నీ శిరస్సు సిగ్గుతో క్రిందకు వాలిపోకుండా ఎట్లా నిలబడుతోంది? నువ్వెప్పుడయినా నీ ముఖాన్ని అద్దంలో చూసుకున్నావా? నీ నుదుటిమీద బొట్టురంగుకీ, నీ ముఖంరంగుకీ తేడా కన్పడుతుందా? నీ కళ్ల కాటుకరేఖలు నీ చెంపల రంగుకన్నా భిన్నంగా ఎప్పుడయినా కన్పడినాయా?"

సుందరి మౌనంగా తల వంచుకుని కూర్చుంది. మౌనం అర్ధాంగీకారం. తనిచ్చిన ఉపన్యాసం ఆమెను ఎందుకు గాయపర్చలేదో సుదర్శనానికి అర్థం కాలేదు. పట్టుదల పెరగుటంతోఅతని మానవ మేధ పైశాచికపు అంతస్తును జేరుకొని తన ఔన్నత్యాన్నినిరూపించ జేసుకుంటున్నది.

"ఇంతకీ నా ఖర్మ! నేను చచ్చేదాకా నీతో గడపవలసిరావటం నా పురాకృతం కాకపోతే మరేమనుకోనూ? నిన్ను చూస్తేనే నా ఒళ్లు జలదరిస్తోంది. నాకు చచ్చిపోవాలన్న కోర్కె బలీయమైపోతోంది. నీకు నన్ను పదిహేను వేలుపెట్టి కొనుక్కున్నానన్న అహంభావమేకాని నా మరణబాధ తెలుస్తుందా? తెలుస్తే ఎట్లాగయినా నా విముక్తికి ప్రయత్నిద్దువు. అసలు నీ మనస్సులోకి అందమైన ఊహలంటూ వస్తాయా? నా జీవితానందాన్ని పదిహేనువేలకి అమ్ముకున్నాక నేనెందుకు జీవించాలి? సరే, కానీయ్! దీనివల్ల వృద్ధాప్యంలో నా తల్లి, తండ్రి ఇల్లూ వాకిలీ లేక నిర్వాసితులైపోకుండా కాపాడ గలిగాననే తృప్తి నాకు ఆత్మశాంతి కలిగిస్తుంది. పుట్టినందుకు, వాళ్లు నన్ను విద్యాబుద్ధులు చెప్పించి పెంచినందుకు, వాళ్ల మాట కాదనకుండా మీ రిచ్చిన పదిహేనువేల రూపాయలతో నీ మెళ్లో మూడు ముళ్లూ వేసి, వాళ్ల అప్పుల్ని తీర్చగలిగాను. ఇంక వాళ్లు ఏ బాదరబందీ లేకుండా హాయిగా ఉండచ్చు. వాళ్ల సేవలు చేసి తరించటానికి కోరి తెచ్చుకున్న కోమలివి ఉండనే ఉంటావు. నేను ఏ చెరువులోనో దూకి ఛస్తేకాని నా మనస్సు, నిన్ను చూస్తుంటే భగ భగ మండే మనస్సులోని దావాగ్ని చల్లారదు."

చెప్పవలసిందేదో అయిపోయినట్లుగా గోడ వైపు ముఖం పెట్టుకొని ఒత్తిగిలి పడుకున్నాడు సుదర్శనం.

సుందరి బాధగా నిట్టూర్చింది. తన చేతుల కేసి, కాళ్ల కేసి చూసుకొంది. నిజమే. చూసిభరించలేనంత నల్లగా ఉంది తను! తనను ఎందుకు ఇలా పుట్టించి శిక్షిస్తున్నాడు భగవంతుడు? అందుకు తనేం చెయ్యాలి? చల్లని గాలి విసురుకు కిటికీ తలుపులు టకటకా కొట్టుకుంటున్నాయి. ఆమె జ్వలిస్తున్న హృదయంలో గతించిన ఆవమానపు స్మృతులు బలంగా చెలరేగి మరింత రంపపుకోత కోస్తున్నాయి.

దసరా పండుగ రోజులు. ఇల్లంతా ఎంతో కలకల్లాడుతూ ఉంది. అందరికన్న ఎక్కువగా సంతోషపడుతూ ఇల్లంతా అలగం తిరుగుతున్నది, పదేళ్ల సుందరి. తనకు జ్ఞానం వచ్చాక లలితక్క తమ ఇంటికి రావటం ఇదే మొదటిసారి. లలితక్కకు పాప కలిగినప్పుడు వచ్చిందట. తనకు జ్ఞాపకం లేనేలేదు. ఆ పాపకిప్పుడు నాలుగేళ్ళట! ఇంచక్కగా తను ఎత్తుకుని ఆడుకోవచ్చును. ఇప్పుడు తనతో నేస్తం చెయ్యని పిల్లలందరూ దాన్ని చూస్తూనే ఉడుక్కునిపోతారు. వాకిట్లో బట్కా ఆగగానే పరుగెత్తుకుని బండి దగ్గరికి వెళ్లింది. తల్లీ, తండ్రీ గుమ్మంలో నించుని ఆనందంగా ఆహ్వానించారు లలితనూ, భర్తనూ. తెల్లగా బంతిలా ఉన్న చిట్టిని ఆదరంగా ఎత్తుకోబోయింది సుందరి.

"ఏయ్, పిల్లా! ఎవరు నువ్వు? దాన్ని ముట్టుకోకు." కఠినంగా కసిరాడు లలిత భర్త. నాలుగేళ్ల చిట్టి గునగున నడిచి తల్లి కాళ్లను గట్టిగా చుట్టుకొని బిగ్గరగా ఏడవసాగింది. సుందరి చిన్నబోయి బిక్కగా చూస్తూ నిలబడిపోయింది.

"అమ్మా! ఎవరే ఈపిల్లా?" అంది లలిత, తన కూతుర్ని ఎత్తుకొని సముదాయిస్తూనూ.

తల్లి తెల్లబోయింది.

"మన సుందరేనే! నీ చెల్లెలు!" అంది సర్దుకుని, ఆవిడ.

"అయ్యో! బొత్తిగా రోజురోజుకూ కాటిక్కాయయిపోతోందేమిటమ్మా? ఆనవాలు పట్టలేకపోయానుసుమా! నాలుగేళ్లయిందిగా నేను వచ్చి!" అన్నది సమర్థింపుగా లలిత. ఆమె నవ్వుగా పొడుగ్గా ఉంటుంది. తండ్రి మౌనంగా నిలబడిపోవటం గమనించింది సుందరి.

"అప్పా! కాణీంబియ్యావ్!" అని అడిగితే అణాకాసు తీసి ఇచ్చాడు ఆయన. పరుగెత్తుకొని కొట్టుమీదికెళ్లి గుప్పెడు బిస్కట్లు కొనుక్కుని వచ్చింది. నెమ్మదిగా అక్క దగ్గరకు వెళ్లి అక్క ఒళ్లో ముఖం పెట్టుకు కూర్చున్న చిట్టికేసి చేయిచాపి, "దా! ఇదిగో! అప్పచ్చి!" అంది మురిపెంగా చూస్తూ. చిట్టి కాస్సేపు సుందరికేసి ఎగాదిగా చూసి తల్లి కడుపులో ముఖం దాచుకుంది.

"దా! చిట్టీ! దామ్మా! చూడు ఈ బిస్కట్లన్నీ



ఇంటికి
ఫోటో—ఎ. ఎల్. కాంతారావు
(సికిందరాబాదు)

నీకే ఇచ్చేస్తా! దా!" ఎంతో ప్రేమగా పిలిచింది.

"వెళ్లవేం, పిన్ని పిలుస్తుంటే!" అంది అక్క. సుందరికి ధైర్యం వచ్చి చిట్టిని ఎత్తుకోబోయింది. ఆ పిల్ల విలవిల్లాడుతూ క్రిందికి దిగజారి నేలమీద కాళ్లు జాపుకుని కూర్చుని రాగాలు తీయటం ప్రారంభించింది.

"అది దడుసుకొందే, సుందీ! పోనీలే, దాన్ని ఏడిపించకు! నాలుగు రోజులు మాలిమి అయితే అదే వస్తుంది, నీదగ్గరికి! పోయి ఆడుకోమ్మా!" అంది అక్క.

తనతో ఎవ్వరూ ఆడుకోవటానికి రారని అక్కతో చెప్పటానికి ఆ పిల్లకు ధైర్యం చాలలేదు. కాని ఎవరితో ఆడుకుంటుంది? అందరు పిల్లలూ తన్ను లోకువగా చూస్తారు. ఆట మధ్యలో ఏదో వంకపెట్టి ఇసకలోకి త్రోసి

# కృష్ణసుందరి

జుట్టు పీకేసేవారు. "నన్ను ముట్టుకోకు! వామాలకాకి!" అని ఏడిపించేవారు. బళ్ళో మాస్టర్లు ఏమాత్రం కాస్త పాఠం తప్పు అప్పజెప్పినా "నల్లమొద్దూ!" అని తిడుతారు. పొరుగింటి లక్ష్మికి ఒక్క లెఖ్ఖా రాకపోయినా, పాఠాలు తిన్నగా అప్పచెప్పకపోయినా ఏమీ అనరు. ఎంతో గారంగా ముద్దుగా చూస్తారు. ఆ పిల్ల తెల్లగా బొద్దుగా ఉండటంనుంచి అందరి పిల్లలూ నేనంటే నేను అని పోటీలుపడి ఆ పిల్ల ప్రక్కనే కూర్చుంటారు. ఆ పిల్లకు అస్సలు చదువు రాకపోయినా ఎవ్వరూ ఏమీ అనరు. తన ప్రక్కన కూర్చోవటానికే ఎవ్వరు ఇష్టపడరు. స్కూలు వదలగానే తనొకర్తే రోడ్డు ప్రక్కగా తల వంచుకొని నడుచుకుంటూ ఇంటికి వచ్చేస్తుంది. తలెత్తి చూడటానికి భయం! తన్నుచూచి అందరూ వెక్కిరిస్తున్నట్లూ, నవ్వుతున్నట్లూ అనిపిస్తుంది. మొదట్లో తనను అంతా ఎందుకు లోకువగా చూస్తున్నారో తెలియక, నాలిక బయటకుపెట్టి ఎవరన్నా, ఏమన్నా అనటం తడవుగా వెక్కిరించేది! దానితో వాళ్ళు ఇంకా ఏడిపించేవారు. ఇప్పుడిప్పుడు పెద్దదవుతున్నకొద్దీ తనలో ఏదో వికృతం ఉండబట్టే వాళ్ళు అల్లా వెలివేస్తున్నారనే విషయం ధ్రువపరుచుకున్నది. ఇందాక అక్కయ్య తనను 'కాటిక్కాయయిపోతున్నదే' అనటంతో ఇంత అవమానానికీ కారణం తను నల్లగా ఉండటమే అని తేలిపోయింది. చివరికి చంటిపాపకూడా తనను చూసి జడుసుకుందన్న మాట! ఈ ఆలోచనతో కళ్ల నీళ్ళూరుతుండగా రోడ్డుమీద సరదాగా ఆనందపు నురగల్లా ఆడుకుంటున్న తోటి పిల్లలను తన కన్నీటి తెర ల్లోంచి చూస్తూ, అరుగుమీద నిస్పృహాయంగా నిలబడింది సుందరి. బజారునుంచి వచ్చిన ఆమె తాతయ్య సుందరి కళ్లల్లోని ఆరని తడినీ, రోడ్డుమీద ఉత్సాహంగా ఆడుకొనే పిల్లల ఆహ్లాదపు వడినీ గమనించారు. అమాంతం సుందరిని పైకెత్తుకుని ఆ పిల్ల రెండు చెంపలూ గాఢంగా ముద్దెట్టుకుని, "సుందీ! ఎందు కేడుస్తున్నావ్? పిచ్చిపిల్లా! నీకు ఆడుకుందుకు మంచి బొమ్మ ఇస్తా. ఏడవకు" అన్నారు.

సుందరిలో ఇందాకటినుంచీ కళ్లల్లోనే ఆరిపోదామనుకున్న దుఃఖమంతా కట్టలుతెగి ఉరవళ్ళు పరవళ్ళుగా చెంపలమీద ప్రవహించింది. తాతయ్య మెడ కౌగలించుకొని బిగ్గరగా ఏడ్చేసింది. ఆయన సుందరిని లోనికి తీసుకొని వెళ్లి సముదాయిస్తూ, "చూడు, సుందీ! ఈ కృష్ణుడు బొమ్మ తీసుకో! ఈ బొమ్మతోనే ఆడుకో! ఎంత మంచివాడనుకొన్నావ్! నీకన్నా నల్లగా ఉంటాడు. అంతకన్న నల్లగా ఉన్న యమున నీళ్లల్లో కేరింతాలు కొడతాడు. నీలాంటి నల్లటి ఆడపిల్లలను ఎంతో ప్రేమిస్తాడు. అస్సలు నీలాంటివాళ్ళతోనేకాని తెల్లటివాళ్ళతో ఆడనే ఆడడు" అన్నారు. ఆ మాటలు ఆ పసిదానిలో బలంగా హాతుకునాయి. సుందరికి క్రమక్రమంగా నిశ్శబ్దంగా జీవించటం అలవాటు అయినది. స్కూల్లోకూడా ఎవరేమన్నా మౌనంగా సహించేది. ఆమె మంచితనాన్ని లోకువగా తీసుకుని అందరూ ఏడిపించేవారు. అయినా ఆమె తాతయ్య చెప్పిన చిన్ననాటి మాటలతో మానసికంగా దార్ఢ్యం సంపాదించింది. ఇంటికి రాగానే తన గదిలో కూర్చుని, తన నల్లని దైవానితో తను ఆరోజు పడ్డ మాటలన్నీ చెప్పుకునేది. ఆ బొమ్మ తన మనస్సులోని బాధంతా విని తనను తాతయ్యలాగే సముదాయించినట్లు భ్రమించేది. దానితో ఆమె మనస్సు ఎంతో హాయిగా సున్నితంగా గాలిలో తేలిపోయే వేణునాదంతో విహరించేది.

సుందరి, స్కూల్‌కంతటికీ మంచి మార్కులతో స్కూల్ ఫైనల్ పాసయింది. అది అందరికీ ఆశ్చర్యకారణమే అయింది. ఎప్పుడూ నెమ్మదిగా మాట్లాడుతూ, నెమ్మదిగా చదువుతూండే ఈ పిల్లకు అంత విజ్ఞానం ఎల్లా ఒంటబట్టిందాఅని ఆశ్చర్యపోయారుస్కూల్‌మాస్టర్లు. ఈ నల్లపిల్లకు అన్ని మంచిమార్కులూ రావటం తెల్ల పిల్లలకు సహించరాని విషయమే అయింది.

"మన సుందికి మంచి మార్కులొచ్చాయేవ్! కాలేజీలో చేర్పిస్తాను" అన్నారు సుందరి నాన్న, అమ్మతో.

"నయం! బాగానే ఉంది సంబరం! ఇప్పటికే పెద్దవాళ్ళకన్న అయిదారువేలు ఎక్కువిస్తేకాని ఇది ఇంట్లోంచి కదిలే సూత్రం కన్పట్టంలేదు. ఇంక కాలేజీలమ్మటకూడా పంపిస్తే చూడాలి మన తిప్పలు" అన్న తల్లి మాటలు విన్నది సుందరి. తనకు పెళ్లా! తనను ఎవరు పెళ్లి చేసుకుంటారు? నిష్కారణంగా తోటి వ్యక్తిని తను బాధించటం కన్న తన మానాన తను



నీలాటి రేవులో
చిత్రం—మాదిరాజు మురళీకృష్ణ
(హైదరాబాదు-7)

ఉద్యోగం చేసుకుంటే, రోజులు నిశ్చింతగా దొర్లిపోతాయి.

"నాకు చదువుకోవాలని ఉందమ్మా!" అన్నది, తల్లి దగ్గరికి వచ్చి. కూతురు నిర్మలమైన ముఖం చూడగానే తల్లి హృదయం స్నిగ్ధమైంది.

"కాలేజీ చదువులు అంటే మాటలామ్మా? ఏదో ఇప్పటికే ఆలస్యం అయిపోయింది. ముందు ముందు నీ పెళ్లి చేయాలంటే బోలెడు ఖర్చు అవుతుంది."

"పోనీ అనవసరంగా అంత డబ్బు ఖర్చు పెట్టటం ఎందుకమ్మా? నేను ఏదన్నా చిన్న ఉద్యోగం చేసుకుంటాను."

"అదేం మాట తల్లీ! మన ఇంటావంటా లేనిది? ఇప్పటికే కాలయాపన జరిగిందే అని నేను విచారిస్తున్నాను. లోకులంతా, పెళ్లిచేయలేక ఉద్యోగంలోకి దింపారని కాకుల్లా పొడుస్తారు. ఇప్పటికే నీకు అక్కయ్యలకంటే అయిదారు వేలు ఎక్కువ ఇస్తేకాని ముడిపడే సూత్రం కన్పడటం లేదు. మళ్లీ నీకొక్కదానికే ఇస్తే ఎల్లా కుదురుతుంది? ముగ్గురు బావలూ అలిగికూర్చుంటారు. అందరికీ కలిపి ఒక్కసారిగా అంత డబ్బు ఎల్లా తేవాల్నో సతమతమవుతున్నాం నేనూ, మీ నాన్నానూ."

"నా ఇష్టంమీద నేను ఉద్యోగం చేసుకుంటే లోకుల కెందుకు మధ్యని? మీరేం బలవంతం చేశారా నన్ను?"

"నీకు తెలీదు సుందీ! మన గుండెలను పిండే మాటల సూదులఫ్యాక్టరీలు ఈ లోకుల మెదళ్ళు. వాళ్లకొచ్చే లబ్ధి ఏమీ లేకపోయినా, మనం అతి తెలివిగా మాట్లాడామనుకోవటంతో వాళ్లకొక తృప్తి కలుగుతుంది."

"మనం వాళ్ళ మాటల్ని లెక్కచేయనే వద్దు, అమ్మా! మన కుటుంబ పరిస్థితుల్ని బట్టి మనం నడుచుకునేదానికి ఒకరితో ఏం పని?" సుందరి ఎప్పుడూ ఇంతగా మాట్లాడి ఎరుగదు. ఆమెలో కలిగిన భావిని గూర్చిన అస్పష్టాందోళన వల్ల ఇన్ని మాటలు మాట్లాడి, తనలో తనే ఆశ్చర్యపోయింది.

"లెక్కచేయకపోవడానికి మనం అడవిలో లేముకద! నిత్యం వాళ్లమధ్య ఉంటూ, వాళ్ల మధ్య మసలుతూ వాళ్ళ మాటల్ని వినకుండా బ్రతకగలిగే నిశ్చలత్వం మనకెలా వస్తుంది? మనం ఋషులమా, పంచాగ్నుల మధ్య తపస్సులు చేయగలగటానికి?"

సుందరిని నిస్పృహ ఆవరించింది. రోజులు లెక్కపెట్టుకుంటూంటే అవి తరగకుండా ఉన్నాయి. ఎవరైనా చూసుకుందుకు వస్తారని తెలియగానే సుందరి గుండెలు దడదడలాడేవి. వీళ్ళు ఇవ్వదలచిన మొత్తానికాశించి చూసుకుందుకు వెంటనే వచ్చేవారు. సుందరి పుట్టెడు బరువుతో నీళ్ళు కారిపోయేది. వాళ్ళు చూస్తూనే "చ్! బొత్తిగా నలుపు!" అనేసేవారు. ఆమాట వాళ్ళు అనకుండా వెళ్ళలేకపోయేవారు. ఆ మాట

(తరువాయి 50 వ పేజీలో)

# ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

## ఉగాది నవలల పోటీ

## రు 2,500 లు బహుమతులు

శోభకృతు సంవత్సరారంభసమయంలో కూడా నవలల పోటీ నిర్వహించాలని సంకల్పించాము. రచయితలకు, రచయిత్రులకు ఇతోధికమైన ప్రోత్సాహం ఇవ్వడానికి నిశ్చయించాము.

**శోభకృతు ఉగాది నవలల పోటీలో గెలుపొందే నవలలకు ఈ దిగువ పేర్కొన్న విధంగా బహుమతులు ఇవ్వడానికి నిశ్చయించాము:**

మొదటి బహుమతి రు **1,500** లు
రెండవ బహుమతి రు **600** లు
మూడవ బహుమతి రు **400** లు

పోటీలో పాల్గొనేవారు పాటించవలసిన నిబంధనలు ఇవి:

1. రచన 250 అరఠావు కాగితాలకు మించరాదు.
2. సిరాతో, కాగితానికి ఒక ప్రక్కనే వ్రాయాలి.
3. ఇతివృత్తం ఆంధ్రుల జీవితానికి సంబంధించినదై ఉండాలి.
4. సాంఘిక, చారిత్రిక ఇతివృత్తం ఏదైనా ఎన్నుకొనవచ్చు.
5. అనువాదాలుకాక స్వీయ రచనలు మాత్రమే పోటీకి పంపాలి.
6. బహుమతిపొందని రచనలలో ప్రచురార్హమైనవి ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురించే హక్కు మాకు ఉన్నది.
7. బహుమతి పొందని రచనలను, ప్రచురార్హం కాని రచనలను త్రిప్పి పంపగలము.
8. పోటీకి పంపే రచనలను 'ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, చిత్తూరు'కు పంపాలి.
9. కవరుమీద 'ఉగాది నవలల పోటీకి' అని స్పష్టంగా వ్రాయాలి.

**ఉగాది నవలల పోటీకి రచనలు మాకు చేరవలసిన ఆఖరితేది**

**1963 జనవరి 31**

*రచయితలు ఈ అవకాశం వినియోగించుకొని, తమ సంపూర్ణ సహాయ సహకారాలు అందజేయాలని అర్థిస్తున్నాము.* —ఎడిటర్

## కృష్ణసుందరి

( 36 వ పేజీ తరువాయి)

వినటంతోనే సుందరి నవనాడులూ క్రుంగిపోయేవి. తల్లి,తండ్రీ మటుకు తమ ప్రయత్నాలు ఈ పరాజయాలవల్ల మానేవారు కారు. ఓడిపోయిన కొద్దీ పట్టుదల పెరిగిపోయేది వారికి. చివరికి వాళ్ళ తీవ్ర ప్రయత్నాల వలలో సుదర్శనం తల్లితండ్రులు చిక్కుకున్నారు. వాళ్లు సమ్మతి తెల్పిననాడు సుందరి తన చెవులను తనే నమ్మలేకపోయింది.

కలా! కథా!! సుదర్శనం చూసుకుందుకు వచ్చినాడు అతనికేసి ఒకసారి తలెత్తిచూసింది. నచ్చగా పొడుగ్గా ఉన్నాడు సుదర్శనం. అతన్ని చూస్తూనే చెప్పలేనంత జాలివేసింది సుందరికి. అతను ఎంతో దూరప్రాంతంనుంచి వచ్చాడు తనను చూసుకోవటానికి. కాని అతను తనకేసి చూడనేలేదు. తలవంచుకు కూర్చున్నాడు. అతను తనకేసి చూసి ఏ రిమార్కూ ఇయ్యకుండానే అవతలికి వెళ్ళిపోయినందుకు మనస్సులో వేయి ప్రణతులర్పించింది సుందరి. అల్లాంటిది ఏకంగా పెళ్లికే ఒప్పుకున్నారంటే ఆమె విస్మయానికి అంతులేదు. అంతా భగవంతుని దయ అనుకున్నది. ఆమెకు స్కూల్ మానివేసినప్పటినుంచీ దొరికిన పుస్తకమల్లా చదువుకుంటూ కూర్చునే అలవాటు అయినది. అందులో "ధర్మాంగద" చరిత్ర ఆమెకెంతో ఇష్టంగా ఉండేది. అందులోని "త్రైలోక్య సుందరి" దివ్య తిరుపతులన్నీ సేవించి, పామును మనిషిగా మార్చుకుంది. ఈ సుందరుడు కూడా తనతో దివ్య తిరుపతులన్నీ సేవిస్తే, తను తెల్లగా, పావురం రెక్కలా మారిపోతుందేమో ఎవ్వరికి తెలుసు? ఇతను తప్పకుండా తనను శాప విముక్తురాలుగా చేయగలిగిన సమర్థుడై ఉంటాడు. అందుకనే తనను పెళ్ళాడటానికి చూసికూడా ఒప్పుకున్నాడు. అతన్ని ఎల్లా పూజించాలి? తన హృదయంలో నిండుతూన్న అమృతాన్ని అంతా బంగారు బిందెలలోనింపి అతన్ని అభిషేకం చెయ్యాలి. తన శరీరాన్నే కర్పూరంగా చేసి అతనికి హారతులియ్యాలి. ఇంత భక్తీ మనస్సునిండా ఆవరించగా, పూజారిణే అయింది సుందరి.

వివాహ మంటపంలో పెళ్లికుమారుని తరపున వచ్చిన ప్రతిఒక్కరూ సుందరిని చూసి నిర్ఘాంతపోయారు!

"ప్చ్! ప్చ్! ప్చ్!" అని పెళ్లికూతురిని చూస్తూనే నిట్టూర్పులు విడిచారు. "డబ్బు కోసం కక్కుర్తిపడి సుదర్శనం జీవితాన్నే నాశనం చేసుకున్నాడు" అని అభిమానులు ఎంతో జాలి ప్రదర్శించారు.

"నువ్వు చూసుకొనే ఒప్పుకొన్నావా? అంతా అమ్మా నాన్న ప్రయత్నమా?" అని దగ్గరి బంధువులు జిజ్ఞాస చూపించారు!

"ఏదో త్యాగం చేసేనని డబ్బా వాయించుకుందామనుకున్నావుటోయ్ భైయ్యా! ఏ త్యాగం

నిలువ పదిహేనువేలని కూపీ లాగేశాంలే!" అని స్నేహితులు సుదర్శనం వీపుతట్టి మరీ చెప్పారు. సుదర్శనం ఆవిరిలో ఉడకబెట్టిన కుడుములా అయిపోయాడు. పెళ్లిచూపులప్పుడు సుందరి కళ్ళ జాలివల్ల కలిగిన సానుభూతితో ఆలోచించ గలిగిన సుదర్శనం యువక మనస్సులోని భావాల పరిధి ఈ విపరీత వ్యాఖ్యానాలవల్ల విస్తృతంకావటానికి బదులు కుంచించుకపోయింది. ఆ వేడికి సానుభూతి కరిగిపోయి అతనికి జీవితంపట్ల కలిగిన తీవ్ర అసహన జ్వాలల్లో ఆవిరైపోయింది.

అతనిలో జరుగుతున్న భావ సంఘర్షణ సుందరి మన్నిత హృదయం గ్రహించింది. తమ బంధువులంతా "మీ రెల్లాగయినా దేవాంతకులు. రంభల్లాంటి పిల్లలకి మేము సంబంధాలు కుదుర్చుకోలేకపోయాం. మీ రిట్టే చేయగలిగారు" అని తల్లిని అభినందిస్తున్నప్పుడూ, "నీ కెల్లా దొరికాడే! ఈ అయిడియలిస్ట్!" అని తోటి ఆడపిల్లలు తన్ను మెచ్చుకున్నప్పుడూ సుందరి మనస్సు మధురోహల్లో తేలిపోయింది.

ఈ ఘడియకోసం కోటి జన్మాల తపస్సు వరంగా వేయి కన్నులతో ఎదురు చూసింది.

ఆశాస్వప్నం కరిగిపోయింది. సుందరి జీవితపు చివరి కోరిక సుదర్శనం తీరని అందాల దాహంలో చెరిగిపోయింది. తను నిరర్థక జీవి!

'నన్ను ఎందుకు ఇల్లా పుట్టించావ్ భగవంతుడా! పుట్టించినవాడివి నన్ను గురించి సానుభూతితో ఆలోచించగలిగే మనుష్యులను ఎందుకు ఉత్పత్తి చేశావ్?'

ఆమె మనస్సులో తటిల్లున ఒక ఆలోచన మెరిసింది. ఇరువయినాల్గ్గంటల క్రితం తాళి గట్టిన భర్త! తనతో జీవితాంతం గడపలేక పోతానన్నాడు. అతను చనిపోతే తనకీ లోకంలో విలువేముంటుంది? తనను బాలికగా, కన్యగా, నవ వధువుగా ఆదరించలేని ఈ సుందర రూపులు తను వితంతువుగా ఉన్నప్పుడు సానుభూతితో చూడగలుగుతారా? తను జీవన యాత్రను ఎలా నిర్వహించేది? తన మెళ్లో మూడుముళ్లూ వేసినందుకు ఆయనే తనకు తరణోపాయం చూపెట్టారు.

టేబుల్‌మీది అలారం నాలుగున్నర చూపెడుతున్నది. అనంతమయం వెన్నెల్లో అప్పుడప్పుడూ నిద్రపట్టని కాకి ఒకటే అరుస్తున్నది. లేచినవారెవరో తలుపుగడి గొళ్లెం తీసినట్లున్నారు. "టప్" మని చప్పుడయింది. సుందరి కృతనిశ్చయురాలై లేచి నిలుచుంది. ప్రాతఃకాలపు చల్లని గాలి సుదర్శనాన్ని హాయిగా జోకొట్టుతున్నది. సుందరి క్షణంసేపు అతని కాళ్లవైపు నిలుచుంది. అప్రయత్నంగా ఆమెకు కళ్లమ్మట నీళ్లు తిరిగాయి. జడలోని సన్నజాజి పూల చెండును అతని కాళ్లమీద వడేసి వెనుదిరిగి తలుపు తీసుకుని బయటకు నిష్క్రమించింది. అందరూ గాఢ సుషుప్తిలో లీనమై ఉన్నారు.

చెరువులో నీళ్లు తన శరీరాన్ని చల్లగా తాకటంతో నిలువునా పులకరించిపోయింది స్వాగతమిస్తాయి అ జలతరంగాలు! దోసిలితో ఆ చల్లని నీళ్ళు ముఖంనిండా చల్లుకుంది. ఎంత హాయి! ఏదో తెలియని వివశత్వం ఆమెను ఆవరించింది. ఆకాశాన్ని వెన్నెలలో తెల్లబోతున్న తెలిమబ్బుల చివర నించి సలలిత మురళీ నినాదం, ఆమె చెవులలో సున్నితంగా ఏదో చెబుతున్నట్లు భ్రమించింది. చిన్ననాడు తన తాతయ్య తనవరం చేసిపోయిన నల్లదేవుడు తనతో ఏదో చెబుతున్నాడు. తన ఆరాధ్య దైవం! ఆ దేవుడు ఏమంటున్నాడు?

"రా చెలీ! నేను నలుపు! నువ్వు నలుపు! ఆ యముననీళ్ళు నలుపు! ఈ నలుపులో మనం మలచుకున్న అందాల తలపుల తెలుపుల స్వచ్ఛతతో సుందర మనుష్యుల మనువాం! మన శరీరాల కన్నా నల్లనైన మనస్సులు కల ఈ శారీరక సుందరులవల్ల నీ జీవితానందమే సంక్షిప్తమౌతున్నది. అది నేను భరించలేను. నా దగ్గరకు వచ్చివేయి, చెలీ! నేను నీ చిన్ననాటి నేస్తాన్ని. నీలమేఘ రూపుణ్ణి. నిన్ను ఎంతో నిండు మనస్సుతో ఆహ్వానిస్తున్నాను. నా దగ్గరకు వచ్చేయ్ చెలీ!"

ఆ మాటలు ఆ అలలమీది చిరుగాలి తరగల్లోంచి తేలివస్తున్నాయి! తాతయ్య చెప్పిన మాటలు అక్షరాల నిజం. ఎంత ఆదరంగా పిలుస్తున్నాడు! అందుకే ఏ దేవప్రతిమల్నైనా నల్లని శిలలతో మలుస్తున్నారు! 'నాలో భగవదంశ ఉన్నది కనుక నేను నల్లగా పుట్టాను. నిజం!! ఓహో! అద్భుతం! ఎవ్వార్లకు తెలిసింది?'

సుందరి కళ్ళు భరించలేని ఆనందంతో అర మూతలు పడ్డాయి. ఆమె కాళ్ళు తేలిపోయాయి. ఆ వెన్నెల్లో మెరుస్తున్న నల్లటి నీటి అలలపై ఆమె తుషార బిందువులాంటి చీర చెరగు రెపరెపలాడుతూ పరుచుకోవటం ఉషె కన్య చూసి ఆ చెంగు అందుకోవటంకోసం చెరువుమీదికి వంగింది. చంద్రాస్తమయాన్ని భరించలేని కలువలు బాధతో ముడుచుకుపోయి మొగ్గలైపోయాయి. ★


మా జీవిత విధానంతో

పరుల జోక్యాన్ని

సహించము

ఇది మా తిరుగులేని

నిర్ణయము



విజయసాధనకు

వజ్రసంకల్పముతో

విరామంలేకుండా

పనిచేయండి



# తరచుగా మూత్ర విసర్జన

చక్కెరతోగాని, చక్కెర లేకుండగాని తరచుగా మూత్రం విసర్జించడం ప్రమాదకరమైన చిహ్నం. అది శరీర తత్వాన్ని ధ్వంసం చేయడమే కాకుండా, రోజ రోజుకు రోగిని మృత్యు సమీపానికి తీసుకువస్తూంటుంది. ఆరంభంలో శారీరకంగా కానీ, మానసికంగాకానీ శ్రమపడడానికి అయిష్టత, నడుం నొప్పి, దృష్టి మాంద్యం, తొడలవద్ద తిమ్మిరి, సర్వసాధారణంగా బలహీనత మొదలైన లక్షణాలు కనబడుతూవుంటవి. ఈ లక్షణాలు గోచరించటం తోనే తగిన చికిత్స చేయకపోతే, ఉత్తరోత్తరా అమితదాహం, ఆకలి, నోరు, గొంతు ఎండుకపోవుట, దురద, కాళ్లలో సంకటం, బరువు తగ్గటం, శరీరమంతా పొట్లు, కీళ్లవాతం, కళ్ల పొర, టి. బి, కురుపులు, రాచపుండు, తదితర తీవ్రవ్యాధులకు గురికావలసి వస్తుంది. "సీనవ్ చారం" బిళ్లలు వాడి వేలాది మంది శమనంపొంది మృత్యువాతపడకుండా తప్పించుకున్నారు. "సీనవ్ చారం" బిళ్లలు ప్రాచీన యూనాని వైద్యసిద్ధాంతం ప్రకారం శాస్త్రీయంగా అరుదైన మూలికలతోను, వనస్పతుల సారములతోను, స్వాభావికమైన క్షారములతోను తయారుచేయబడ్డవి. ఈ చికిత్సమొదలుపెట్టిన రెండవ, లేదా మూడవ రోజునుంచే అమితదాహం మూత్రంలో చక్కెర తగ్గి, తరుచుగా మూత్రవిసర్జన చేయటం విడిచి పోతుంది. కొద్దిరోజులలోనే మీకు సగానికి పైగా స్వస్థత చేకూరినట్లు విపించును. "సీనవ్ చారం" ఖర్చు తక్కువ. నిరపాయమయినది. తీసుకొనడం సులభం. ప్రత్యేక కఠినపథ్యాలుకానీ, ఉపవాసాలు చేయవలసిన అవసరంకానీ వుండవు. రోగులు పుష్టికోసంబలప్రవర్ధకమైనవివిధపదార్థములను భుజించవచ్చును. కోరినవారికి పూర్తివివరాలుకల సాహిత్యం ఇంగ్లీషులో పంపబడును. 50 బిళ్లల ఖరీదు 8.75 న.పై. ప్యాకింగ్, పోస్టేజి పుచితం.

**(Selling Agents):**
**Barrys Commercial Corporation**
**(WHA)**
**27/A Dhurumtollah Street,**
**Calcutta-13.**